# మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

## బీఆర్ఎస్ భద్రాచలం ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తాతా మధు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తాతా మధు

దుమ్ముగూడెం, అక్టోబర్ 12: వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనని ఎమ్మెల్సీ, పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాతా మధు అన్నారు. నడికుడి గ్రామంలో గురువారం భద్రాచలం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావుతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకట్రావు ఎన్నో ఏళ్ల నుంచి పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని, అలాంటి వ్యక్తిని ప్రజలు ఎన్నికల్లో గెలిపించుకుంటే ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. వెంకట్రావును గెలిపిస్తే దుమ్ముగూడెం మండలవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయిస్తామన్నారు. 60 ఏళ్ల నుంచి పాలనలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. భద్రాద్రి జిల్లాకు పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ఎలాంటి పథకాలు అమలుతున్నాయో.. మన వద్ద ఎలాంటి పథకాలు అమలవుతున్నాయో ప్రజలు తెలుసుకోవాలన్నారు. పంటలకు ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవన్నారు. ప్రతిపక్షాలు అధికారంలోకి వచ్చేందుకు మోసపూరిత ప్రకటనలు చేస్తున్నాయని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు వారంటీ లేనివన్నారు. 1,200 మంది బలిదానాలు చేసుకుంటే తెలంగాణ వచ్చిందన్నారు. భద్రాచలం నియోజకవర్గం 50 సంవత్సరాల నుంచి వెనుకబడి ఉందని, బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటే సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుందన్నారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ... 2018లో బీఆర్ఎస్ అధిష్ఠానం తనకు టికెట్ ఇచ్చిందన్నారు. ఆ ఎన్నికల్లో ఓటమిచెందానని, ఈసారి మళ్లీ తిరిగి తనకే పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ టికెట్ ఇవ్వడం ఆనందాన్నిచ్చిందన్నారు. భద్రాచలం ఏజెన్సీలో పుట్టిన తనను ఎన్నికల్లో గెలిపించాలని, తద్వారా నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకుంటానన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అన్నెం సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కల్తి రాములు, సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు, పార్టీ అధికార ప్రతినిధి ఎండీ జానీపాషా, శ్రీనివాసరాజు (వాసు), జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, నాయకులు తాండ్ర రమణ, రమేశ్ గౌడ్, బొలిశెట్టి రంగారావు, హనుమంతరావు, ఎండీ నవాబ్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు..

నడికుడి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 55 కుటుంబాలు గురువారం బీఆర్ఎస్ భద్రాచలం ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ తాతా మధు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. వారికి మధు గులాబీ కండువాలు కప్పి దిశా నిర్దేశం చేశారు. కార్యకర్తలు సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. ప్రతిపక్ష పార్టీలను నమ్మొద్దని, వచ్చే ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

### బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి..

భద్రాచలం, అక్టోబర్ 12: భద్రాచలం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావు గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ, పార్టీ భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి తాత మధుసూదన్ అన్నారు. గురువారం ఆయన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావుతో కలిసి విశ్రాంత బ్యాంక్ అధికారి కోటగిరి ప్రబోధ్‌కుమార్‌తోపాటు పలువురు ప్రముఖులను కలిశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. వారి వెంట పార్టీ నాయకులు తాండ్ర వెంకటరమణారావు, దుద్దుకూరి సాయిబాబా, బొలిశెట్టి రంగారావు, తాండ్ర నరసింహారావు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారాన్ని ఖండించిన ఎమ్మెల్సీ తాతా మధు

**రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు ప్రచారానికి తెర**

**తప్పుడు వీడియోలను సృష్టిస్తే చట్టపరమైన చర్యలు**

**బీఆర్ఎస్ జిల్లా ఖమ్మం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు**

భద్రాచలం, అక్టోబర్ 12 : తాను ప్రభుత్వ అధికారులను దూషించినట్లు బయట జరుగుతున్న ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని, ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తాలేని కొన్ని రాజకీయ పక్షాలు తమకు అనుకూలమైన మీడియాలో గోబెల్స్ ప్రచారానికి తెరలేపాయని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ విలేకరుల సమావేశంలో తెలిపారు. తాను అధికారులను దూషించినట్లు జరుగుతున్న ప్రచారాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఎప్పుడో 2019లో చిత్రీకరించిన పాత వీడియోను సోషల్ మీడియాలో కొందరు వైరల్ చేస్తున్నారన్నారు. నాటి గ్రామ పంచాయితీ ఎన్నికల్లో తాను కొందరు అధికారుల తీరుకు నిరసనగా వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు. నాటి వీడియోను ఇప్పుడు ప్రచారం చేయడం సబబు కాదన్నారు. అధికారులకు కించపరిచే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదన్నారు. అధికారులతో శాసనమండలి సభ్యుడిగా తనకు స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని స్పష్టం చేశారు. 2019లో తాను శాసన మండలి సభ్యుడిగా లేనని, రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే బదనాం చేస్తున్నారన్నారు. అలా తప్పుడు ప్రచారం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రెస్ సమావేశాల్లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగంగా బరితెగింపు భాష ఉపయోగిస్తారని, అలాంటి వ్యక్తిని తాను కానన్నారు. ఆయన వ్యవహార శైలిని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

## సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



ఎమ్మెల్యేకు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు

వేంసూరు, అక్టోబర్12: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన కుంచపర్తి, బీరాపల్లి, గూడూరు, కల్లూరుగూడెం దూళ్ల కొత్తూరు, రాయుడుపాలెం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు బతుకమ్మలతో స్వాగతం పలికారు. అనంతరం పలుచోట్ల నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆరు దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ చేయలేని అభివృద్ధిని బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేసి చూపించిందన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచనా లేకుండా కృషి చేశానని, ఇకముందు కూడా అదేవిధంగా పని చేస్తానన్నారు. ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలన్నారు. దళితబంధుపై కాం గ్రెస్ పార్టీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, దళితబంధు ఇచ్చే బాధ్యత ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్నారని స్పష్టం చేశారు. ఎవరూ అధైర్యపడొద్దని ప్రజ లకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటిరెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, సీడీసీ డైరెక్టర్ పుచ్చకాయల శంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు..

కుంచపర్తికి చెందిన 30 కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎంతోమంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో కోటమర్తి చిన్నకృష్ణ, కిన్నెర పుల్లయ్య, కిన్నెర ఆనందరావు, కిన్నెర సీతారాములు, కిన్నెర నాగేశ్వరరావు, కొరకొప్పుల సీతారాములు, కంచర్ల బాలస్వామి, కిన్నెర పెద్దబాబు, బీమాల కుటుంబరావు, మోటపోతుల శ్రీను, ఇజ్జగాని కేశవులు, బలగాని నాగరాజు, మోటపోతుల సత్యం పాల్గొన్నారు.

# కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి

**ప్రభుత్వ విప్ రేగా కాంతారావు**



సమావేశంలో మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

అశ్వాపురం, అక్టోబర్ 12: ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పినపాక నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. మొండికుంట గ్రామంలోని కె.వి.ఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున బూత్ కో-ఆర్డినేటర్లు కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీని అత్యధిక మోజారిటీతో గెలిపించుకునేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రజల అశీర్వాదంతో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులే తన బలం, తన బలగమన్నారు.

# మధిరలో గులాబీ జెండా ఎగురవేస్తాం

**బీఆర్ఎస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు**



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ముఖ్యనాయకులు

మధిర, అక్టోబర్ 12: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మధిరలో గులాబీ జెండా ఎగురవేస్తామని బీఆర్ఎస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. మధిర పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఆయన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి నిర్వహించిన బూత్ జోనల్ లెవల్ పార్టీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్సేనన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ప్రజల ఓట్లతో గెలిచి వారి సంక్షేమాన్ని విస్మరించారన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం మధిర నియోజకవర్గ అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చించిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే భట్టి విక్రమార్క కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు డిప్యూటీ స్పీకర్‌గా, ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారని, అయినా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకపోయిందన్నారు. ఆయనకు ఓటమి భయం పట్టుకుందని, ఈ కారణంతోనే ఆయన దళితబంధు, గృహలక్ష్మి వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ, టీడీపీకి చెందిన 30 కుటుంబాలకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, మొండితోక జయాకర్, రావూరి శ్రీనివాసరావు, చేబ్రోలు మల్లికార్జునరావు, పంబి సాంబశివరావు, పెంట్యాల పుల్లయ్య, కనుమూరు వెంకటేశ్వరరావు, దాచేపల్లి లక్ష్మారెడ్డి, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# విభేదాలు పక్కన పెట్టి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు మదన్‌లాల్**

కారేపల్లి, అక్టోబర్ 12: బీఆర్ఎస్ నాయకులు అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు మదన్‌లాల్ పిలుపునిచ్చారు. కారేపల్లిలోని వైఎస్సార్ గార్డెన్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా నియోజకవర్గంలో పార్టీని గెలిపించి పార్టీ అధినేతకు కానుకగా ఇవ్వాలన్నారు. నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, నాయకులు ఉన్నం వీరేందర్, , షేక్ గౌస్, హనుమకొండ రమేశ్, సంత దేవాలయ చైర్మన్ అడ్డగోడ ఐలమ్మ, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616